

క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి తిరునాళ్ల క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త గంజి చిరంజీవి ఆదివారం ఆవిష్కరించారు.



సీతారాముల కల్యాణం

పాత గుంటూరు: గుంటూరు బ్రాడీపేట ఓంకార క్షేత్రంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామికి తులసి దళార్చన చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 517.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 817.50 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా విజయ గణపతి స్వామి రథోత్సవం



పాత గుంటూరు: ఎస్‌వీఎస్ కాలనీ శ్రీ విజయ గణపతి స్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం విశ్వక్సేన పూజ, నిత్య హోమం, గణపతి హోమం తిరువంజనసేవ మూలవిరాట్‌కు విశేష అభిషేకం, తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం విజయగణపతి స్వామి వారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించి తరించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

నేటి నుంచి మల్లేశ్వర స్వామికి నిత్య పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి. స్వామి వారికి తెల్లవారుజామున 6 గంటల నుంచి 11 గంటల వరకు అభిషేకం జరుగుతుంది. అభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ. 500 టికెటు కొనుగోలు చేయడం ద్వారా ఇద్దరిని సేవకు అనుమతిస్తారు. అష్టోత్తర పూజ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు జరుగుతుంది. సేవలో పాల్గొనే భక్తులు రూ. 100 టికెట్టు కొనుగోలు చేయాల్సి ఉంది. టికెట్‌పై ఇద్దరిని సేవకు అనుమతిస్తారు.

ముగిసిన సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేనతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ ఏసీ చక్రధరరావు తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 9 గంటలకు శ్రీ మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి(భక్తిరస నాటకం) చరిత్ర భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

వేడుకకు వేళాయె

నేటి నుంచి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం సోమవారం ప్రారంభం కానుంది. ఏటా మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) పర్వదినాన ప్రారంభమై 15 రోజులు పాటు జరిగే ఉత్సవాలను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పారుపూడి, నెరుసు వంశస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అంకురార్పణ చేస్తారు. సంప్రదాయం ప్రకారం పట్టణ పోలీసులు పసుపు కుంకుమ సమర్పించి తొలి పూజ చేయటంతో తిరునాళ్ల మహోత్సవం మొదలవుతుంది. మెట్టినింట కొలువైన అమ్మవారు రాత్రి 7.30 గంటలకు ఊరేగింపుగా బయలుదేరతారని ఆలయ ట్రస్టీ పారుపూడి సుబ్బారావు తెలిపారు. అమ్మవారు పల్లకీలో పట్టణ వీధుల్లో ఊరేగి మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఊయల స్తంభాలకు చేరుకుంటారన్నారు. ఊయల ఉత్సవం పూర్తి చేసుకున్న పిదప ఆలయ ప్రవేశం చేసి భక్తుల పూజలందుకుంటారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, రవాణా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి పీఎం శ్రీకారం

- ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పీఎంశ్రీ పథకం దోహదం
- జిల్లాలో ఎంపికైన 21 పాఠశాలలు
- 17 పాఠశాలల్లో వసతుల కల్పనకు అంచనాలు పంపిన అధికారులు
- ఆధునిక బోధనా వసతులు.. ప్రయోగశాలలకు నిధులు



సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థినులు (ఫైల్)

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి గుంటూరు జిల్లాలో 21 పాఠశాలలు ఎంపికయ్యాయి. విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని పెంపొందింపజేసి ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు పీఎంశ్రీ ద్వారా పాఠశాలల్లో వివిధ రకాల వసతులు కల్పించనున్నారు. పీఎంశ్రీ కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ల్యాబొరేటరీలతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యా కోర్సులు అందించనున్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ఆధునిక విద్యకు కేంద్రాలుగా పాఠశాలలను తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్రం నిధులు విడుదల చేయనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధులు జోడించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 21 పాఠశాలలకుగాను 17 పాఠశాలల పరిధిలో అవసరమైన సదుపాయాల కల్పనపై అంచనాలు సిద్ధం చేశారు.

ఆధునిక సదుపాయాలు

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు నూతన భవన నిర్మాణాలను చేపట్టడంతోపాటు టాయిలెట్లు, గ్రంథాలయం, సౌర విద్యుత్ వ్యవస్థ, పాఠశాలల ప్రాంగణాల్లోనే కాయగూరలు, ఆకుకూరల సాగు, కాలుష్యానికి తావు లేని విధంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణాలు ఉండాలనే నిబంధన విధించింది. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, డిజిటల్ లైబ్రరీ, క్రీడల్లో ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని రకాల క్రీడా సామగ్రిని అందించనుంది. కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడతారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పీఎంశ్రీ కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలల నిర్వహణలో విద్యాశాఖతోపాటు స్థానిక సంస్థల భాగస్వామ్యం ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. నిధుల వినియోగంపై పక్కాగా ఆడిట్‌తో పాటు మంజూరు చేసే నిధులను కాంపొనెంట్స్ వారీగా ఖర్చు చేయాల్సి ఉంది.

క్లౌడ్ మేనేజ్‌మెంట్ విధానంలో తరగతుల నిర్వహణ

పీఎంశ్రీ ద్వారా ఎంపికైన పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న కంప్యూటర్ల ద్వారా క్లౌడ్ మేనేజ్‌మెంట్ విధానంలో వివిధ ప్రాంతాల నుంచి ఫ్యాకల్టీని కనెక్ట్ చేసి విద్యార్థులకు తరగతులను బోధించాలనే వినూత్న విధానం అందుబాటులోకి రానుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు జాతీయస్థాయి విద్యాసంస్థల్లో నిపుణులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులచే లైవ్ క్లాసెస్, వర్చువల్ రియాలిటీలో అవగాహన కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయి.

అంచనాలు సిద్ధం చేసి పంపాం

> జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన 21 పాఠశాలల్లో కల్పించాల్సిన వసతులు, ప్రయోగశాలల ఏర్పాటుపై అంచనాలు సిద్ధం చేయించాం. వీటిలో 17 పాఠశాలలకు సంబంధించిన అంచనాలను ఉన్నతాధికారులకు పంపాం. పాఠశాలల వారీగా సమగ్ర వివరాలతోపాటు, క్రీడా స్థలం, తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.
> – జి.విజయలక్ష్మి, ఏపీసీ, సమగ్ర శిక్ష, గుంటూరు

సీఎం జగన్ ప్రభంజనాన్ని చంద్రబాబు తట్టుకోలేరు

- 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలపలేని దుస్థితిలో చంద్రబాబు
- పేదవర్గాలను తూలనాడే మనస్తత్వం చంద్రబాబుదైతే.. వారికి అగ్రపీఠం వేసే మంచి మనసున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్
- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున



పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజా ప్రభంజనాన్ని తట్టుకునే శక్తి చంద్రబాబుకు లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆదివారం పర్చూరులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను కూడా పెట్టలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. సామాజికంగా ఆయన పరిపాలనలో అసమానతలు పెరిగిపోయాయని ఆ విషయాన్ని ప్రజలు గమనించారని, పూర్తి సామాజిక న్యాయంతో సీఎం వైఎస్ జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు. ఆ కోణంలో ప్రస్తుతం రాష్ట్రంలో పరిపాలన సరళి సాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ రూ.2.58 లక్షల కోట్లు డీబీటీ రూపంలో పేద ప్రజలకు సమాజంలోని ఎక్కడా అవినీతి లేకుండా పారదర్శకంగా అందించారన్నారు. మరి చంద్రబాబు నాయుడు తన హయాంలో ఎందుకు చేయలేకపోయారనే విషయం ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. తాను చేసే తప్పులు తన కొడుక్కి, కుటుంబానికి చుట్టుకుంటాయని ఇప్పటికే ఎన్టీఆర్‌కు తను చేసిన అన్యాయం కారణంగా ఆయన శాపం తగిలిందని విమర్శించారు. సీఎం జగన్, వైఎస్సార్ సీపీ మంత్రులు, నాయకులు గురించి విమర్శించే హక్కు చంద్రబాబుకు లేదని, ఆయన ఒకవేలు తమవైపు చూపితే నాలుగు వేళ్లు తన వైపు చూపుతాయని తెలుసుకోవాలన్నారు.

- చంద్రబాబు తాను నిర్వహించే సభలకు ఎంత డబ్బు వెచ్చిస్తున్నారో, ఎంతమందికి మద్యం పోయిస్తున్నారో మాకంతా తెలుసునని, రాప్తాడులో జరిగిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభను చూసి బుద్ధి తెచ్చుకోవాలని మంత్రి హితవు పలికారు. పర్చూరు నియోజకవర్గంలోని దేవరపల్లిలో దళిత భూములను లాక్కుంటే తాను వచ్చి పోరాటం చేసి విడిపించడం జరిగిందని అన్నారు. దళితులను గెలిపించ గలిగే శక్తి, దమ్ము, ధైర్యం మా నాయకుడికి ఉందని, చంద్రబాబు కనీసం తన సొంత కొడుకుని మంగళగిరిలో గెలిపించుకోలేకపోయాడని ఎద్దేవా చేశారు.
- రాష్ట్రంలో నీచ రాజకీయాలు చేస్తూ, రూ.కోట్లు కొల్లగొట్టిన వ్యక్తి చంద్రబాబు నాయుడని, అటువంటి వ్యక్తి మా నాయకుడిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా నోరు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో పేదలు, దళితులు, బడుగులు, గిరిజనులు అని తేడా లేకుండా కించపరచే మనస్తత్వం చంద్రబాబుది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్చూరులో ఆయన నిర్వహించి బహిరంగ సభలో తనను విమర్శించడం చంద్రబాబు నాయుడుకు తగదని, ఆయన స్థాయికి అటువంటి విమర్శలు చేయడం ఏ మాత్రం సహించదగినది కాదన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: పాడి రైతుల ఆదాయాన్ని పెంచి, వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో అధికారులతో మాట్లాడారు. మూడవ విడత పాలవెల్లువలో ప్రత్తిపాడు, పెందనందిపాటు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లో మొత్తం 43 పాల సేకరణ కేంద్రాలు ప్రారంభించామన్నారు. ప్రతి కేంద్రంలోనూ రోజుకు కనీసం 100 లీటర్లు తగ్గకుండా పాలసేకరణ జరిగేవిధంగా కృషి చేయాలన్నారు. పాల కేంద్రాల్లో పాలు పోస్తే లీటరుకు అదనంగా రూ. 20 నుంచి రూ.40 వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. పాడిరైతులకు వర్కింగ్ క్యాపిటల్ కింద తక్కువ వడ్డీకి రుణాలు, పశువుల దాణా అందజేసేందుకు ఏపీ డెయిరీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రమణీయం.. ప్రతిష్టాపనోత్సవం

- మల్లేశ్వరుని ఆలయంలో పరివార దేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ట
- వైభవంగా కుంభాభిషేకం
- నూతన ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్ట
- పాల్గొన్న దేవదాయ శాఖ మంత్రి, చైర్మన్, ఈఓ



ఆలయంలో దేవతామూర్తులు



పూజల్లో పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్ నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 14న నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ తాపడ శిఖర ప్రతిష్టా మహోత్సవాలను శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రారంభించింది. ఆదివారం ఉదయం మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో యాగశాలలో ఆది దంపతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కేఎస్ రామారావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులతో పాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. నూతన ధ్వజస్తంభానికి మంత్రి కొట్టు సత్యనారాయణ, చైర్మన్, ఈవోలతో పాటు దాత సంగా నరసింహారావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సుముహూర్తాన..

స్వామి వారి ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభం, నందీశ్వరుడు, కాలభైరవుడితో పాటు పలు సపరివార దేవతా విగ్రహాల ప్రతిష్ట జరిగింది. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు బద్రీనాథ్‌బాబు, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, లింగంభోట్ల బద్రీనాథ్‌బాబు, రఘునాథశర్మ(పండు), శ్యావశ్వ మహర్షి, యువీఎస్ మురళీధర్ శాస్త్రిలతో పాటు ఆలయ అర్చకులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 11.45 గంటలకు పరివార దేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ట, పూజా కార్యక్రమాల అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ శిఖరంపై స్వర్ణ కలశ ప్రతిష్ట జరిగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి బాలాలయంలో భద్రపరిచిన జలాలతో కళాపకర్షణ, దేశంలోని వివిధ సముద్రాలు, నదులు, తీర్థాల నుంచి సేకరించిన జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు దంపతులు ఆలయ శిఖరం వద్ద నిర్వహించిన కుంభాభిషేకంలో పాల్గొన్నారు. యాగశాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణిలతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

ఆలయానికి పునర్ వైభవం: మంత్రి కొట్టు

మల్లేశ్వర స్వామి వారి ఆలయ కుంభాభిషేకం అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రకృతి అన్ని రకాలుగా కరుణించాలంటే భగవంతుడి అనుగ్రహం ఉండాలన్నారు. వెయ్యేళ్ల చరిత్ర ఉట్టి పడేలా స్వామి వారి ఆలయాన్ని పునర్ నిర్మించామని, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, స్వర్ణ తాపడ శిఖరాన్ని ప్రతిష్ట ఎంతో వైభవంగా నిర్వహించామన్నారు. రాష్ట్రంలో జీర్ణోద్ధరణకు చేరుకున్న ఆలయాలను పున నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యత తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో అనేక ఆలయాలకు పునర్ వైభవం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దైవసంకల్పం తోడైందన్నారు.

ఆకాశంలో అద్భుతం!

మల్లేశ్వర స్వామి వారి ఆలయ ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్టా మహోత్సవ సమయంలో అద్భుతం చోటు చేసుకుంది. ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్టకు పది నిమిషాలు ముందు ఆకాశంలో గరుడ పక్షులు ప్రత్యక్షమయ్యాయి. 9 గరుడ పక్షులు పది నిమిషాల పాటు ఆలయ శిఖరంపై ప్రదక్షిణలు చేస్తూ కనిపించాయి. ఆలయ శిఖరానికి స్వర్ణ కలశాన్ని చేరేందుకు పైకి ఎక్కుతున్న ఆలయ అర్చకులు ఈ విషయాన్ని గమనించి ఆలయం వద్ద ఉన్న భక్తులకు, ఆలయ సిబ్బందికి తెలిపారు.

రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ విజేత 'ప్రకాశం'



విజేత ప్రకాశం జట్టు క్రీడాకారిణులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో ఫైనల్ విజేతగా ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ప్రకాశం, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా జట్లు పాల్గొన్నాయి. లీగ్ మ్యాచ్‌లో గెలుపొంది ఫైనల్ పోటీల్లో ప్రకాశం జట్టుపై శ్రీకాకుళం జట్టు తలపడింది. ఈ పోటీల్లో నిర్ణీత సమయంలో శ్రీకాకుళం 18 పాయింట్లు సాధించగా, ప్రకాశం జట్టు 25 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. రెండోస్థానంలో శ్రీకాకుళం జట్టు, మూడో స్థానంలో కృష్ణా జిల్లా జట్టు, నాల్గవ స్థానంలో విశాఖపట్నం జట్టు నిలిచాయి. అనంతరం పూర్వ విద్యార్థులు విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ క్రీడల సంక్షేమ అధికారి, అంతర్జాతీయ క్రీడాకారుడు నక్కల అర్జున్‌రావును గ్రామ పౌరులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పూర్వ విద్యార్థులు పోలకం చంద్రశేఖర్, పి.అంజి బాబు, జి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పి.రమేష్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• వల కళ



కిటకిటలాడుతున్న ఫిష్‌ల్యాండ్ సెంటర్

ఆదివారం వేట అదరగొట్టింది. మత్స్యకారుల వల కళకళలాడడంతో ఆనందం వెల్లివిరిసింది. వాడరేవు మత్స్యకారుల వలలో కూనం, టైగర్ రొయ్యలు, టూనా, పీతలు, అపోలో ఫిష్, పారలు, గురక, పండుగప్ప, తోక చేపలు, గురకలు, కానాగంత చేపలు లభించడంతో తీరం క్రయ విక్రయాలతో కిక్కిరిసింది. చీరాల వాడరేవు నుంచి సముద్ర సంపదను చెన్నై, కోల్‌కత్తా, మైసూరు, బెంగళూరు, హైదరాబాద్ వంటి ముఖ్య నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. మత్స్య సంపదను తీరం ఒడ్డునే విక్రయించిన మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతో పాటుగా ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు మత్స్య సంపదను కొనుగోలు చేశారు.

– చీరాల టౌన్



వలలో దొరికిన ముక్కు చేపలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న సముద్రపు పీతలు

క్లుప్తంగా

రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు దారుణం

ప్రముఖ జర్నలిస్టు పి.సాయినాథ్



పాత గుంటూరు: కేంద్ర ప్రభుత్వం రైతులపై చేస్తున్న దాడులు దారుణమని సుప్రసిద్ధ జర్నలిస్ట్ పి.సాయినాథ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ అధ్యక్షతన నార్ల వెంకటేశ్వరరావు పురస్కార ప్రదానోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. సాయినాథ్ పాల్గొని మాట్లాడుతూ అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు, వైమానిక దాడులు చేయడం అత్యంత విచారకరమని చెప్పారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత, కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. దేశంలోని అన్ని స్వతంత్ర ప్రభుత్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించారని వివరించారు. దేశంలో పత్రికా వ్యవస్థ అంబానీ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. రాష్ట్రాల జీడీపీల కన్నా అంబానీ, అదాని ఆస్తులే ఎక్కువని పేర్కొన్నారు. సభ అనంతరం సుప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని పి.సాయినాథ్‌కు అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, లాయర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, బీసీ కే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జయసుధ, ఎండీ అక్బర్ బాబు, అనిల్ నొరియా పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో గ్రూప్-2లో విజయం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రణాళికాబద్ధమైన కృషి, పట్టుదలతో గ్రూప్-2 ఉద్యోగాన్ని కైవసం చేసుకోవచ్చునని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఈనెల 25న నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఆదివారం ఏసీ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రూప్-2 సిలబస్‌తో పాటు పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రామాణికమైన పుస్తకాల గురించి వివరించారు. భారత సమాజం, చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రిలిమినరీ, మెయిన్స్‌లో ఉండే సిలబస్‌ను వివరించారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పి. రామారావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము, జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

మళ్లీ సీఎం వైఎస్ జగన్ ఖాయం

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- ముఖ్య అతిథిగా హాజరైన చీరాల ఎమ్మెల్యే కరణం
- నాగులపాడు పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నాగులపాడు పీఏసీఎస్ కమిటీ ప్రమాణస్వీకారానికి హాజరైన చిన హనిమిరెడ్డి, ఎమ్మెల్యే కరణం

అద్దంకి రూరల్: 2024లో కూడా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కూకట్ల కన్వెన్షన్ హాలులో నాగులపాడు పీఏసీఎస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి పూనూరి నరేంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హనిమిరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరయ్యారు. తొలుత చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి మానికొండ నాగరాజుకు నాగులపాడు పీఏసీఎస్ అధ్యక్ష పదవి దక్కిందన్నారు. రైతులకు ఎటువంటి కష్టం రాకుండా చూడాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు చూపే ప్రలోభాలకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను లొంగరన్నారు. ఎవరో బెదిరిస్తే బెదిరిపోయేవాడిని కాదని చెప్పారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లి అడిగినా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందించే పథకాలతో హాయిగా ఉన్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని వివరించారు. డబ్బు కోసం పార్టీని అమ్ముకోనని, వ్యాపారస్తుల దగ్గర డబ్బులు గుంజుకోనని పరోక్షంగా విమర్శలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, అవ్వాతాతలు వైఎస్సార్ సీపీని గెలిపించుకోవటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యే ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ అద్దంకికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి వ్యక్తి అయిన హనిమిరెడ్డిని పంపారన్నారు. ఆయన గెలుపుకోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎన్నికల్లో హనిమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం నాగులపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మానికొండ నాగరాజు, సభ్యులుగా భీమనాథం రాఘవరెడ్డి, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు (సద్దయ్య)లతో పీఏసీఎస్ సూపర్‌వైజర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, పార్టీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ ఎస్.కొండలు, జువ్విరాము, గూడా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలను విస్మరించే వ్యక్తిని కాదు

ఎమ్మెల్యే కరణం



ఒంగోలు: చంద్రబాబుకు కార్యకర్తలను వాడుకోవడం అలవాటు. నా రాజకీయ జీవితంలో గెలిచినా.. ఓడినా ఎన్నడూ కార్యకర్తలను విస్మరించలేదని.. వారికి ఎప్పుడూ అండగా ఉన్నానని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శనివారం పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు బహిరంగ సభలో తనను కించపరిచేలా చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేను చీరాలకు వెళ్లినా గెలిచానంటే పార్టీలకు అతీతంగా తనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, అంతే తప్ప చంద్రబాబు శక్తి వల్ల కాదన్నారు. చివరకు అద్దంకి నియోజకవర్గంలో నా సహకారం ఉండబట్టే టీడీపీ గెలిచిందన్నారు. గత ఎన్నికల్లో పర్చూరులో ఓడిపోయే పరిస్థితులు ఉంటే నేను అక్కడి వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించానని.. అప్పటికీ నాయకులు మాకు విషం ఇవ్వు, ఉరితాడు ఇవ్వు అంటూ కళ్లనీళ్ల పర్యంతం అయిన విషయాన్ని కూడా తెలుసుకోలేకపోతే ఎలా అన్నారు. అయినా పార్టీ నిర్ణయానికి లోబడి మీరు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటే నేడు మాపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తారా అంటూ మండిపడ్డారు. బల్లికురవ మండలం వేమవరంలో జంట హత్యలు జరిగితే పార్టీ తరఫున కార్యకర్తలను కనీసం పరామర్శ కూడా చేయలేకపోవడానికి సిగ్గుండాలన్నారు. టీడీపీకి ఓటు వేయబట్టే నేడు మేము బాధితులుగా మిగిలాం అంటూ మహిళలు వచ్చి నన్ను ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని పరిస్థితికి లోనయ్యామన్నారు. జగన్‌ను ప్రతిసారి ఖైదీ నంబర్ అని రెచ్చగొట్టబట్టే జైలు జీవితాన్ని నువ్వు చవిచూడాల్సి వచ్చిందని.. మరి పచ్చమీడియా నాటి ట్రోల్స్ ఇప్పుడు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కారణం నువ్వు కూడా జైలుకు వెళ్లబట్టే అన్నారు. జగన్‌కు మాకు ఇక అండర్ స్టాండ్ ఉందని.. అందు వల్లే చీరాల బాధ్యతలను వెంకటేష్‌కు అప్పగించారన్నారు.

చంద్రబాబు ఒళ్లుమరచి మాట్లాడుతున్నాడు!

అద్దంకి: చంద్రబాబునాయుడు ఒళ్లుమరచి అవాకులు, చవాకులు పేలితే ఎవరూ చేతులు ముడుచుకుని కూర్చునేది లేదని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ధ్వజమెత్తాడు. పట్టణంలోని కూకట్ల కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నాగులపాడు సొసైటీ పాలకల మండలి ప్రమాణ స్వీకార సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా బదులిచ్చాడు. ఎవరో పిలిస్తే వచ్చినవాడు వచ్చినట్టు ఉండక నాపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నేను నా రాజకీయ జీవితంలో ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. ఎవరైనా చేస్తే చేతులు ముడుచుకుని కూర్చునేది లేదన్నారు. విమర్శించాల్సి వస్తే నీ చరిత్ర ఏమిటో నా చారిత్ర ఏమిటో తేల్చుకుందామా అని సవాల్ విసిరారు. మరొక్కసారి నాపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సభలో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఉన్నారు.

మెరుగైన విధానాలతోనే ఫెడరేషన్ ముందడుగు

నఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న చలసాని రాఘవేంద్రరావు

తెనాలి: రాష్ట్రంలోని సహకార క్రెడిట్ సొసైటీల్లో రుణాల రికవరీకి మెరుగైన మెకానిజమ్‌ను రూపొందించుకునే ప్రయత్నం చేద్దామని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ (నఫ్కాబ్) డైరెక్టర్, ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ కార్యదర్శి చలసాని రాఘవేంద్రరావు సూచించారు. స్థానిక ది కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలోని కాకతీయ సహకార బ్యాంకులో ఆదివారం నూతన నిర్మించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించి, ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ సన్నాహక సభ నిర్వహించారు. కాకతీయ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షత వహించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రజల విశ్వాసం, సహకారంతోనే సొసైటీల మనుగడ సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. సహకార క్రెడిట్ సొసైటీలకు రుణాల రికవరీ సమస్యగా మారిందని చెప్పారు. అర్బన్ బ్యాంకులు అనుసరించే సర్ఫాస్ చట్టాన్ని సొసైటీలకు వర్తింపజేయటం చట్టరీత్యా చెల్లుతుందని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పునిచ్చినట్లు వివరించారు. ఈ చట్టాన్ని క్రెడిట్ సొసైటీలకు వర్తింపజేయాలనే డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. లేదంటే కర్నాటకలో అమలువుతున్న రికవరీ విధానాన్ని అధ్యయనం చేసి, ఆచరణలోకి తీసుకొచ్చేలా కృషి చేద్దామన్నారు. డిపాజిటర్ల భద్రత కోసం బీమా సరైంది కాదన్నారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ సొసైటీ నిర్వహించే వ్యక్తుల సామర్థ్యంపైనే మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాజకీయ ప్రమేయమైన సహకార వ్యవస్థలో 1995 చట్టం వచ్చాక కొన్ని మార్పులొచ్చినట్టు చెప్పారు. అయితే ఏడెనిమిదేళ్లుగా ఎన్నికల్లేవని గుర్తుచేశారు. మాక్స్ సొసైటీ కర్నూలు సీఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ, లోన్ రికవరీ అధికారులను తీసుకోవాలని, డిపాజిట్లకు భద్రత కల్పించాలని అభిప్రాయపడ్డారు. అన్ని సొసైటీలు ఏకరూప సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని సూచించారు. రిటైర్డ్ సహకార అధికారి కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్ఫాస్ చట్టం అమలుచేస్తే రికవరీల సమస్య తగ్గుతుందని, డిపాజిట్లకు బీమాతో భద్రత కల్పిస్తే విజయవంతం కాగలదని వివరించారు. అనంతపూర్ సొసైటీ చైర్మన్ జయచంద్రారెడ్డి, పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎ.ఎల్లారావు, అమలాపురం చాందినీ సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, విశాఖపట్టణంలోని కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ కార్యదర్శి ఎంవీ గణేష్‌కుమార్, 'సహకార భూమి' కానూరి వెంకటకృష్ణ మాట్లాడారు. కాకతీయ సొసైటీ సీఈఓ కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, పీఆర్ఓ చెరుకూరి సతీష్ పర్యవేక్షించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు మహా భిక్షాటన



నాదెండ్ల: సనాతన ధర్మాన్ని ప్రతి హిందువు కాపాడాల్సిన అవసరం ఉందని గణపవరం ఆది పరాశక్తి దేవాలయ క్షేత్రం పీఠాధిపతి శ్రీ నిత్య విద్యానంద భారతీస్వామి చెప్పారు. గణపవరం శివప్రియ నగర్‌లోని గండి పోచమ్మ ఆలయంలో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి దక్షిణ భారతదేశంలో మహా భిక్షాటన చేయనున్నట్లు చెప్పారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాస వద్ద నుంచి ప్రారంభం చేసి చిత్తూరు జిల్లా వరకు మహా భిక్షాటన చేస్తూ అక్కడ ఆలయాలను సందర్శిస్తానని తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి హిందూ ధర్మానికి సహకరించాలని కోరనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా హిందూ సనాతన ధర్మ పరిరక్షణతో పాటు గోమాతను సంరక్షించాలని, అన్యమత ప్రచారాలను నివారించాలని కోరనున్నట్లు చెప్పారు. హిందువులపై జరుగుతున్న దాడులను నివారించి ఆలయాల పునరుద్ధరణకు కృషి చేసేందుకు తమకు సహాయ సహకారాలు అందించాలని కోరనున్నట్లు తెలిపారు. త్వరలో ఆది పరాశక్తి క్షేత్రంలో తొమ్మిది ఆలయాలతో కూడిన రుద్రేశ్వరస్వామి ఆలయం నిర్మించేందుకు భిక్షాటన కార్యక్రమాన్ని చేయనున్నట్లు చెప్పారు.

సీఎం వైఎస్ జగన్ ఆశయ సాధనకు కృషి

పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త యడం బాలాజీ

చినగంజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తూ ఆయన ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. స్థానిక భావన్నారాయణ స్వామి కల్యాణమండపంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మీరందరూ చూపిన అభిమానం వెలకట్టలేనిదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ స్థాపించిన దగ్గరు నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచానన్నారు. మళ్లీ తిరిగి సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పర్చూరు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతో తిరిగి మీ ముందుకు వచ్చానని పేర్కొన్నారు. నన్ను దీవించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తా..

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడుకి, కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయం చేస్తానని తాను భావన్నారాయణ స్వామి సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని యడం బాలాజీ పేర్కొన్నారు. అందరూ పెద్ద మనసుతో తనను ఆదరించాలని వైఎస్సార్ సీపీని నియోజకవర్గంలో గెలిపించి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి మనందరం ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో నూనె వెంకటేశ్వర్లు, అక్కల చంద్రారెడ్డి, కొల్లాటి ఏడుకొండలు, కేవీ రెడ్డి, ఆమంచి వెంకట సుబ్బారావు, పీ లక్ష్మీనారాయణ, బక్కా వెంకట రెడ్డి, పాదర్తి ప్రకాష్, వీవీఆర్ ప్రసాద్, వీ ఉదయ భాస్కర్, రామలక్ష్మణ్ సోదరులు, మారెళ్ల రామకృష్ణ, కేవీ సుబ్బారావు చౌదరి, పాద వెంకట్రావు, కే శ్రీనివాసరావు, ఏ రామకృష్ణ, ఎస్ రామకృష్ణ, పాకనాటి వెంకట రామయ్య, సందు రవితేజ, కుక్కల వెంకటేశ్వర్లు రెడ్డి, అంకిరెడ్డి, కే శ్రీనివాసరెడ్డి, కోట విజయభాస్కరరెడ్డి, సుబ్బరామరెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, భావన్నారాయణ, రవీంద్రరెడ్డి, స్టాలిన్ పాల్గొన్నారు.

గురువు వ్యాఖ్యలకు అర్థం ఉంది..

మైసూరు దత్త పీఠ ఉత్తరాధిపతి విజయానంద తీర్థ స్వామిజీ



దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం చేస్తున్న విజయానంద తీర్థస్వామిజీ

అద్దంకి: గురువులు మాట్లాడే మాటలకు అంతరార్థాలు ఉంటాయి.. వాటిని అంత తేలికగా తీసుకోకూడదని మైసూరు దత్త పీఠ ఉత్తరాధికారి విజయానందతీర్థ స్వామిజీ అన్నారు. పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. తైలాభిషేకం చేశారు. సౌర(సూర్యహోమం)లో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. స్వామిజీ అనుగ్రహభాషణ చేస్తూ 500 ఏళ్ల క్రితం విదేశీయులు ఆక్రమించుకున్న దేస్థానాన్ని శాంతియుతంగా కోర్టు ద్వారా జనవరి 22వ తేదీ ప్రారంభించుకోవడం మరువలేమని చెప్పారు. దత్తాత్రేయుడు ధన్వంతరీ స్వరూపమని ఆయనకు తైలాభిషేకం చేయడం వలన గ్రహ పీడలు, గ్రహదోషాలు, రోగ బాధలు తొలగిపోతాయని చెప్పారు. సూర్యనారాయణ స్వామికి ప్రీతికరమైన వారం ఆదివారమని చెప్పారు. ఈ సభలో విరామ సమయంలో దత్తక్రియా యోగ గురువు డాక్టర్ శివ ధ్యానం శ్వాసపై ధ్యాస ఉంచడం, ముద్రల గురించి భక్తులకు వివరించారు. మార్చి ఒకటి నుంచి 3వ తేదీ వరకు గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య సన్నిధిలో క్రియా యోగా అభ్యాసం జరుగుతుందన్నారు. తరువాత అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్, ధర్మవరపు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్

తెనాలిరూరల్: మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంగానమ్మపేటకు చెందిన రమేష్, అలేఖ్య దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరిని స్కూలుకు తీసుకువెళ్లేందుకు బాలాజీరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ అన్నం శ్రీనివాసరావు అలియాస్ వెంకట శ్రీనివాస్‌ను 11 ఏళ్ల క్రితం మాట్లాడుకున్నారు. పిల్లలను స్కూలుకు తీసుకెళ్లే క్రమంలో అలేఖ్యతో స్నేహం పెరిగి వివాహేతర సంబంధానికి దారి తీసింది. 2014లో ఇద్దరూ ఇళ్లు వదిలి వెళ్లిపోయారు. అలేఖ్య భర్త ఫిర్యాదుతో పోలీసులు వీరి ఆచూకీ గుర్తించి తీసుకువచ్చారు. ప్రియురాలు తనతోనే ఉండాలంటే ఆమె భర్త అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశంతో 2018లో రమేష్‌పై హత్యాయత్నం చేశాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసు విషయమై భర్తతో మాట్లాడి రాజీకి ఒప్పించమంటూ అలేఖ్యపై ఒత్తిడి తీసుకొస్తున్నా ఆమె పట్టించుకోవడం లేదు. దీనికి తోడు శ్రీనివాసరావుకు సమీప బంధువైన అన్నం జగదీష్‌తో అలేఖ్యకు వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలుసుకున్నాడు. ఆమె కారణంగా తన భార్య వదిలి వెళ్లిపోయిందని, కేసు రాజీ విషయం పట్టించుకోకుండ తనకు సోదరుడయ్యే జగదీష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కోపంతో ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక అలేఖ్యతో వాట్సాప్‌లో చాటింగ్ చేస్తూ ఆమె చెప్పిన సమయానికి వారి ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కింద గదిలో ఏకాంతంగా గడిపారు. అనంతరం తనతో తెచ్చుకున్న బ్లేడుతో అలేఖ్య గొంతు కోశాడు. ఆమె మృతి చెందిందని నిర్ధారించుకున్న అనంతరం అక్కడి నుంచి పరార్ అయ్యాడు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఒక్క రోజులోనే నిందితుడి ఆచూకీ గుర్తించామని చెప్పారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి సాక్ష్యాధారాలతో పాటు సాంకేతిక ఆధారాలనూ సేకరించిన సీఐ సుధాకర్, సిబ్బందిని రివార్డులకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్, ట్రాఫిక్ సీఐ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నాగమ్మ ఆలయ పునర్నిర్మాణం.. భావితరాలకు ఆవశ్యకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాటి పౌరుషానికి ప్రతీకగా నిలిచిన నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి భవిష్యత్ తరాలకు అందించాలని పురావస్తు పరిశోధకుడు, కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. వారసత్వ సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం జిట్టగామాలపాడు గ్రామం శివారులోని నాయకురాలు నాగమ్మ ఆలయాల శిథిలాలను ఆదివారం పరిశీలించామన్నారు. ఈ ఆలయం 800 ఏళ్ల నాటిదని చెప్పారు. పల్నాటి యుద్ధంలో నలగామ రాజు మంత్రిగా ఉన్న నాయకురాలు నాగమ్మ బ్రహ్మనాయుడితో పోరాడిన వీర వనితగా గుర్తింపు పొందారన్నారు. నాగమ్మ పౌరుషానికి గుర్తుగా అప్పటి వీరులు నిర్మించిన నాగమ్మ ఆలయ గర్భాలయం, అర్ధ, మహా మండపం శకలాలు శిథిలావస్థలో పడి ఉన్నాయన్నారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయాన్ని పరిరక్షించుకుని భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించాలన్నారు. నాగమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం లేదా స్థానికంగా ఉండే వారు ముందుకొస్తే స్థపతి (ఆలయాల నిర్మాణంలో వాస్తు చూసే వారు)గా తనకున్న అనుభవంతో ఉచితంగా ఆలయ నిర్మాణానికి తన సేవలను అందిస్తానని శివనాగిరెడ్డి చెప్పారు. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం గల నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని పునరుద్ధరించడంతో పాటుగా పల్నాటి యుద్ధ క్షేత్రాలైన మాచర్ల, గురజాల, కారంపూడి, కంభంపాడు, జిట్టగామాలపాడును కలుపుతూ పల్నాడు టూరిస్ట్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాల్సిందిగా ఆయన కోరారు.

దివ్యాంగ జంటలకు సామూహిక వివాహాలు



వధూవరులను ఆశీర్వదిస్తున్న కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు తదితరులు

నెహ్రూనగర్: దివ్యాంగుల ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరులోని కోల్పింగ్ కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగ జంటలకు ఆదివారం వివాహాలు జరిపించారు. శ్రీకాళహస్తికి చెందిన సంతోష్‌కుమార్, విశాఖపట్నానికి చెందిన కొయ్య లక్ష్మీకాంత జంట, గుంటూరుకు చెందిన మన్యం తరుణ్, దువ్వాడకు చెందిన నక్కిన కుసుమ జంటకు, తాడేపల్లి నులకపేటకు చెందిన కసాల దుర్గారావు, తాడేపల్లికి చెందిన ఎల్.నాగమణి జంటలకు బంధు మిత్రుల సమక్షంలో వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) హాజరై మాట్లాడుతూ దివ్యాంగులకు వివాహాలు జరపించడం అభినందనీయమని చెప్పారు. సంఘ సంస్కర్త సూర్యపేటకు చెందిన ముస్త్యాల కిషన్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సిల్వర్ ప్యాలెస్ ప్రొపెయిటర్ సాంబశివరావు, లయన్స్ క్లబ్ నుంచి జగన్, కాస్మోలేజర్ కంపెనీ ఎండీ కులకర్ణి హాజరై దివ్యాంగ జంటలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడంతో పాటు వారికి తగిన సహాయసహకారాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ నాగశ్రీ, ప్రధాన కార్యదర్శి సురేష్, అడ్వకేట్ మాధవి లత పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన జిల్లా కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. నగరంలోని బ్రాడీపేటలోని శ్రీ శ్రీనివాసభవనంలో జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ ఎంపికల్లో జిల్లా అధ్యక్షుడుగా ఎస్.కొండయ్య, అసోసియేట్ అధ్యక్షుడుగా జె.రవికుమార్, ఉపాధ్యక్షులుగా టి.రమేష్, పీ సాంబయ్యలను, కార్యదర్శిగా కె.పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.హనుమంతరావు, కె.మస్తాన్‌రావులను, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.రమేష్‌బాబు, కోశాధికారిగా ఆర్.వెంకమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘం కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు.